# పొట్టపేగులిబ్బంది గోడు

కరణం కల్లోకొత్తే యిబ్బంది గోడికీ సివం బెరిగింది. గణం బూనింది. పూనకమేవచ్చింది. పోతురాజు ముందెగిరినట్టు సిందుల్దొక్కేడు.

'యేవయిందిరా నీకు యెదవ నాయాలా'' అవటాని మోతాదంటే 'పోర్నియమ్మ' అంటా పాళ్ళు పెటపెట కొరికాడు.

'అణ్ణెత్తురు దాగుతా. ఆడి పొట్ట సింసి బేగుల్జెందె వేస్కుంటా'' అంటెగురుతున్నాడు పొట్టపేగులోడు. ఆడిప్పుడా, అబ్బో, పాతికేళ్ళు మట్టి యిట్టా పెగ్గెలు బలుకుతున్నాడు.

''ఆడేందిరట్టరుత్తున్నాడు? ఎవుళ్ళూ తన్నరేంది రాణ్ణి?'' కరణం కస్సు బస్సుమన్నాడు.

''ఆడా, ఆడో యెర్రినాగమ్మ, ఆడి ముకం, అంటూ తూరాని సన్నాసి, సేతిలో సిల్లి గవ్వ లేదు, ఆడోనిట్ట దరిద్దరపోడు. ఆడొల్లేవవుద్ది? యెగరటవే. అంతకంటే యేవుంది? ఆడట్టాగే అంటాళ్ళే. ఆడో లుచ్చా, ఆడి మాటా? ఆడట్టా అంటానే వుంటాడు. మనమింటావే వుండాం గందా.. ఆడి మాట బట్టిచ్చుకోవద్దొరా, నువ్‌బో, అణ్ణి నేన్జూసుకుంటాగా. నేనాడి నోరు మూయిత్తే సరేగా నువ్ బద్దొరా'' అన్నాడెట్టోడు.

''ఆడేందబ్బెగుతుంటే ఎపుడే జెప్పరేందిరా?'' కరణం మిగతావోళ్ళ నుసిగొలిపేడు.

''నువ్వొకిది. ఆడెంతాడిబిసాదెంత? యెందీ దెల్నోడు. నేన్జైస్తా. నువ్ బా' యెట్టోడు బరోసా ఇచ్చాడు.

కరణం వూళ్ళోకి బోతంటే పొట్ట పేగులిబ్బంది గోడు కొరికే వోడికి మల్లే కొర కొర సూసేడు.

పొట్ట పేగులిబ్బంది గోడు




అడికి శానాకాలం బట్టి కరణాన్ని, పీక్కుతినేంత కోపవ్ వుంది. యేంలే, తాతముత్తాతలకాణ్ణుంచి ఈళ్ళు దున్నుకొంటున్న పొలం కరణం గోడు యేరోడికి పట్టా లైను ముందుకెళ్ళాలి సేసిచ్చేడా, అగ్గో, అప్పుణ్ణుంచీడి గుర్రు. పేదోడి కోపవ్ పెదవికి సేటు. పొళ్ళన్నీ అరిగిపోయాయి. పాతికేళ్ళబట్టి కొరిక్కొరికి తింటానికి లెవ్వు. పెదివి పుండయ్యింది. అయినా ఆడా వుండే తొర్రిపొళ్ళతోటే కొరికిందే కొరకటం, నూరిందే నూరటం.

ఇబ్బంది గోడు తాతముత్తాతల్నాడు బాగే బతికాడు. ఇప్పుడిల్లులే, వాకిల్లే, పిల్లకాయల్ని గంటే పాపవని యీ ముండమోపోడితో యాగలేక, ఆడింటిది, సచ్చూరుకుంది. ఇంట్లో ఉడకేసే వోళ్ళు లేకే, ఈడే సేతలు కాలుసుకుంటం.

ఆడేదో ఉడకేసుకోటం సర్లే. పొయ్యి ముట్టిచ్చుకోటవే పీకులాట. పొగ్గొట్టం ఊదలేడు. ఊత్తే గాలి పొగ్గొట్టం లోంచి పోదు. ఆడూత్తే పొయ్యి మండదు. బూడిద లేసుద్ది. ముకానికి పొగడరద్దుద్ది. కళ్ళల్లో దుమ్ముగొట్టుద్ది. పొయ్యి మండిందా, ఇగజూసుకో, సెక్కరం తిప్పేత్తాడు. ఎవురున్నా ఆడకూతురొచ్చి, యేందిరా ఇబ్బందిగా తంటాలు పడతన్నా, లే, నేముట్టిత్తావటాని పొయ్ ముట్టిత్తే, ఇకీడు మొగోడే ! పెతాపరుద్దురూడే! కూడుడకేత్తాడు, కూర జేసేత్తాడు.

ఆడసలి పేరు నరిసిమ్మూతి. ఆ పేరాడేనాడో, ఏల్నాటి నాడే, మరిసిపోయేడు. ఇబ్బందిగా అంటేనే 'యేందిర్నాయాలా?' అంటా పలుకుతాడు. యెవుళ్ళు యెవుళ్ళతోనన్నా ఆడి పేర్లెప్పాలంటే ఇబ్బంది గోడే అంటారు. పూర్తి పేరు సెప్పమంటే పొట్టపేగుల ఇబ్బందిగోడు అంటారు. పొట్టపేగులోడను ఈడు బలుకుతాడు. ఎవురేదడిగినా 'ఇబ్బందిగుంది' అనే వోడు. అయిందానికి కాన్దానికి 'ఇబ్బంది' అంటుండేవోడు. పొద్దుపొడిసింకాణ్ణుంచి కుంకేలోగా అన్నిసార్లు ఆడు 'ఇబ్బంది' అంటుంటే అందరూ ఆణ్ణి 'ఇబ్బందిగోడు' అంటా వచ్చేరు.

ఆడింటి పేరాడికీ దెల్దు. ఆడంగల్లులో కరణం ఏది రాసుంటాడో యెవుడికీ దెల్దు. జనాబా లెక్కల్లో ఆడి పేరట్టాగే వుంది. వోటేసేటప్పుడు ఆడే ఆడి పేరు పొట్టపేగులిబ్బందిగోడని నికారసుగా సారాయి తాగినంత సత్తెపెమాణంగా సెప్పేత్తాడాడు.

ఆడి పొలం పోయినకాణ్ణుంచి పొట్ట గడవటానికి మాంసం అమ్ముకొంటుండేవోడు. గొడ్డు గోసేవాడు. అమ్ముకునేవోడు. పతాదోరం ఆజీలుగా దూడను గోత్తాడు. దుకానం పెడతాడు. పోగులమ్ముతాడు.

బళ్ళో బుడ్డోళ్ళు ఇసికెలో రాసిన అచ్చరాల్లాగా ఆడి మాంసం కుప్పలుండేయి. యెక్కువ లాబవేసుకునే ఆసెబోతాడు గాడాడు. తగుమాత్తరం.

దూణ్ణి గోత్తే లబ్బిసాయిలు దరిసెనమిత్తాడు. దూడతోలు అలవలుసులవలుగా కాజేత్తాడు.

దొబ్బనెత్తురు దబరాలో బట్టి, బాలింతరాళ్ళకు బగుమానంగా బంపేవోడు.

ఆడి దుకానం పూజగది మొయ్యనుండేది. ఆడు కూసోటం సూడాల. పోగులింగితంగా సెట్టేవోడు. అమ్మటం సుతారంగా సూలాగ్గా సేసేవోడు.

ఎవుడన్నా అప్పనంగా దొబ్బుదానని జూత్తే 'గుద్దమీద్దంతే గుంటూర్లో బంతవొరే' అంటా గదిమేవోడు.

దున్నను గోత్తే నాకది గావాలిదిగానాలంటా గావుకేకలు బెట్టే అలగాజనాన్ని సేత్తోనే అదిలిచ్చేవోడు.

ఎవుడికన్నా ముడుసులిట్టం. ఇబ్బందిగోడి కయిట్టం గాదు. పిండెంకలు కొవ్వు మాంసం అళ్ళడుగుతారు. ఆడికయే లెక్కలే. ఈరిగ బాలింతలకీ సూలింతలకీ ఇట్టం. ఈడికిట్టంలే. కండలు జబ్బలెబ్బల్గావాల్రాంటే ఆడీడు. కోసి పోగులు మీదేత్తాడు. వరికీళ్ళకీ గావాల్రా యెండేసుకొంటా వంటాని యెంటబడితే సీదరిచ్చుకొంటాడాడు.

వుల్తోల్మీది మునీసురుకి మల్లె దూడ తోలుమీద బాచిపట్టేసుక్కూ ఉంటాడు. పద్దమ్మాసనం.

ఎవురుకేం గావాలన్నా అమ్ముతాడు గానీ, దొబ్బ పొట్ట పేగులు సస్తే అమ్మడు. ఆడే వొండుకు తింటానికుంచుకుంటాడు. దూణ్ణిగోత్తే పేగులాడి పేణానికి బంగారవే. అత్తారు బత్తెంగా దాసేసుకుంటాడు.

సిన్నప్పుడెప్పుడో కూరొండుకోబొయ్యి దొబ్బ మునిగిందాంకా నీళ్ళు బోత్తా పొయ్యారువు కొన్నాడని అణ్ణిఆడోళ్ళగతాళి బట్టిత్తారు.

ఆడిచ్చురు పక్కికి బెట్టి, వుటికిచ్చురు సవరజేసి, పేగులు పిండి, కడిగి, ఉతికి, జలపరిచ్చి, దబరా గిన్నెలో బెడితే, అది పూల బుట్టకు మల్లె మెరుసుద్ది. ఆడు తీరిగ్గా ఇచ్చురు పుటికిచ్చురు కడుగుతా వుంటే పగటేసెగాడేసెవేసుకొన్నట్టుంటది.

పొట్టపేగులమ్మకుండా ఆడే యెత్తుకుపోయి వొండుకుతింటంటే ఆణ్ణి పొట్టపేగులోడనేవోళ్ళు పల్లోళ్ళు. ఆళ్ళట్టా బిలిత్తే యీడు బలికేవోడు.

ఇబ్బందిగోడు మాంసం గోత్తే పెద్ద గిరాకీ. లేద్దూడల్ని, రోగం రొచ్చు లేవాటిని, కుర్రాటిని, కొవ్వినాటిని గోత్తాడు ఇబ్బందిగోడు.

పక్కూళ్ళ పల్లెలోళ్ళు గూడా అదోరకవయితే ఆజీలుగా ఆడింటిముందు తెల్లారగట్టకే కాకులోలినట్టోలి కావుకావుమంటుంటారు. వొక్కక్కడు రెండూ మూడూ కుప్పలెత్తుకుంటాడు. ఆళ్ళొత్తన్నారు గందాని ఈడు బేరం బెంచడు. కొంటన్నారుగందాని రోగిష్టాటిని గొయ్డు. అణ్ణీతాడిది.

అదోరం యూపారం. ఇంక వారవంతా కాళ్ళా రజావుక్కూకోటవే! ఉంటే కూడొండుకుంటాడు లేబోతే గంజి గాసుకుంటాడు. గంజిగ్గతిలేనోడు కాడీడు.

ఆడికొంపని గుడిసెంటే సిన్న మాట. ఇల్లంటే పెద్ద మాట. గూడంటే సరిపోద్ది. మట్టిగోడలు, తడికె తలుపు, ఒంటినిట్టాడి,తాటాక్కప్పు, కిటికీలంటే తప్పు, బొక్కలంటే సెల్లు. తడికేత్తేఇల్లంతా సీకటి గుయ్యారం. పొయ్యి ముట్టిచ్చకపోతే పొగులు, బుడ్డెలిగిచ్చకపోతే

రేత్రి ఆడిగూట్లో కన్ను బొడుసుకున్నాయేందీ కానరావు.

అడెమ్మా అయ్యా ఉండప్పుడాడి పేరుసుతారం గానే మప్పితంగానే పిలిచేవోళ్ళు పల్లోళ్ళు. అద్దె మద్దెపనా కొడుకులిప్పుడిట్టా బిలుత్తన్నారుగాని అప్పుడట్టా గాదు అనుకుంటాడాడు. అందుక్కారణం పొలం బోటవే. ఏం లేనోడుగాటవే.

ఆడికింకా గురుతే.ఆడి మీసం మొలకలు గోటికి దొరుకుతున్నప్పుడాళ్ళు బగత పరల్లాదాడేరు. ఆడిపేరు నరిసిమ్మూతి కాటాన నరసిమ్మూతి ఎగిసెం కట్టిచ్చేరు.

ఇరెణ్ణె కసివుడికీ నరసిమ్మూతికీ గొడవ. అడుగు లేపి పాడాలి, ఆడాలి. ఏడ్రీడుండాడావటాని నిట్టాడిందంతే దానెనక వక్కున్న నరసిమ్మూతిగోడు ఏదికలోదూకికూసింత సేపు సిందేసి, లగెత్తుకెల్లి ఆణ్ణి బట్టుకోబోవాలి. ఇరెణ్ణకసివుణ్ణిరా నేన్నిన్నిరసక తింటాన్రా అనాలి. అప్పుడలా డట్టాగంటే ఊరకుంటానికీ దేవన్నా గాజుల్తొడుక్కున్నాడా, లే, ఈడిట్టా గంటాడు. నరిసిమ్మమూతినిరా నేన్నిన్నులసక దింటాన్రా'' అవటాని గంతెయ్యాలి.

ఆ నాటకంలో ఇద్దరికిద్దరే! బలే ఎగిరేరులే. ఆ దెబ్బని నరసింమూతిగోడు ఇరెణ్ణికసిపుగోణ్ని లగెత్తి కెల్లి పట్మని ఇరగదీసి మోకాలి మీదేసుకుఒని 'వేన్నిన్నులసక తింటాన్రా' అంటా పొట్ట బిసికి, సింసి, పేగులు బీకి మెళ్లో కేసుకని కసాబిసా నవిలిపారేయాలి.

ఎగిసెంలో నరసిమ్మూతి గోడు నిజం నరిసిమ్మూత్తై ఇరెణ్నెకసివుగోడి పొట్ట పిండేటట్టు బిసుకుతా ఉంటే నాసావిరంగా, రాజేసికం గట్టినోడు కిరీటం అరమనీ పెట్టే మీదికిసిరి, పాంకోళ్ల తెరల్లాగోడి మీద బారేసి, సత్తిన్రా సినబాబా అని కేకబెట్టి, పొట్ట పట్టుకొని స్టేజి మీంచి దూకి, ఉచ్చొచ్చె పియొయొచ్చె ఉరకలేక సావొచ్చెఅన్నట్లు లగెత్తి లగెత్తి దొడ్లల్లోకి బోయిందాకా తిరిగిజూస్తే ఒట్టు. రాజు దిరుసులు కంపుగొడతన్నాయని దిరుసులోడు తకరారుజెత్తే చేతివట్టం పాటపేగులోడితో కట్టిచ్చిన కత పల్లోళ్ళు పాతికేళ్ళయినా మరిసిపోలే.

నరసిమ్మూతిగోడురొండు మూడేళ్ళు దాకా 'నేన్నిన్నులస దింటాన్రా' అంటా పాడతానే దిరుగుతుండేవోడు.

ఇంకెప్పుడు ఏసికాలేసినా ఈడునిజం నరిసింమూతిగా మారిపోతాడని నాటకాలోళ్ళు ఆడికి ఏసికం ఇయ్యలే.

అయితే మాత్తరేమేదంటా ఈడుగ నిజవేసికం యేసి నోడికి మల్లె పొట్లు పద్దేలు సిందులు దరువులు. వొక్కటేంటి దంచుకుంటన్నాడు.

పొట్టపేగులోడెట్టా వొండుకు దింటాడో సూసి నోళ్ళు లేరు. దొబ్బ మాత్తరం

కాలుసుకొని, కల్లు దాగుతా, దాన్ని నములుతా, సుట్ట గొరుకుతా, కళ్ళు మూసుకుని సత్తెపమాణంగా సొరగం సూత్తుండే వోడాడు.

పొట్టపేగులు గోంగూర్లో వండి తింటే నాలిక తెగిపోద్ది. దానెమ్మ దానికా లంకెఎవుడు బెట్టాడ్రా అనే ఇబ్బందిగోడు గోంగూర జోలికే బోడు.

నషాళానికంటే మసాళా కంపు ఆడి కొంపలో బుట్టి అదోరం పల్లెంతా సికార్లు గొట్టుద్ది. యేం మసాళా యెత్తాడో యెట్టా వొండుతాడో, యెట్టా దింటాడో, ఆడి తస్సదియ్య మూడో కంటోడికి తెలియదు.

ఎవుడన్నా ఆడు కూడొండుకుంటన్నప్పుడు బిలిత్తే, ఆడి పనయిందే. అమ్మనా బూతుల పంచేంగం ఇప్పుతాడు. వణ్ణం చెయ్యటం, తింటం, పూజ, పూజ సెడితే సెమడాలోలుత్తాడు. ఆడు తడికేసుకుంటే ఆణ్ణెవుళ్ళూ బిలవరు, తలవరు. తడికి దీసిందాకా ఆడెవుడుతోనూ మాట్టాడ్డు. అది రాములోరి గీత, సీతమ్మ దాటినా పల్లోళ్ళు దాటరు.

అదోరం మాంసం కుప్పలమ్మేసి, డబ్బూ దస్కం మూటగట్టి, దూడ తోలు లబ్బిసాయుబు సైకిలిగ్గట్టి గేరకాళ్ళు యెట్టోడికిచ్చి, ఇచ్చురు, దొబ్బ, పొట్టపేగులు దబరా గిన్నె పూల బుట్టకు మల్లె ముద్దర సుద్దిగా దెచ్చి ఇంట్లో బెట్టి, కల్లు ముంతా, తాంబేటి కాయా గోడకానిచ్చి, దొబ్బ గాలసుకొంటన్నప్పుడ పల్లెల్లో కాలుబెట్టేడు లింగరాజు.

లింగరాజుదా వూరే. పట్నంలో పని. సదూకున్నోడు. ఆడెన్న పోతురాజు. ఆడికి పల్లెలోనే సెప్పులు కుట్టటం కులవృత్తి.

పొట్టపేగులోడు పోతురాజీడోడు. లింగరాజు కాళ్ళిద్దరన్నలే! సిన్నప్పుడీడికాడు నేర్పించి ఇద్దెలన్నీ నేర్పేడు. పెళ్ళం కాడెట్టా పొండుకోవాలో ఆడే ఈడికి నేర్పేడు. ఆడంటే ఈడిగ్గురి.

పల్లెల్లో కాలు బెట్టేడో లేదో, అన్నేడీ అంటా అడిగేవాడు. ఎవుడ్రాడంటే మూతెన్నన్నాడు. ఆడెవుడో ఆళ్ళకి శావాసేపటిగ్గాని తెలీలె

సివరాకిరికి సెప్పేరు యగ్గినం మునుంబెట్టుంటాడు అంటావాని సెబితే లింగరాజు నరసింమూతనే మారు పేరున్న పొట్ట పేగుల ఇబ్బంది గోడింటికి లగెత్తేడు.

మసాళా వాసన బట్టుకుని ఏ దోవనాబ్బనా కాళ్ళీడింటికి లాక్కొత్తాయి. లింగరాజొచ్చేడు.

లింగరాజు వచ్చీ రాటంతోటే 'మూతన్నా' అంటా బిలిసేడు. బదుల్లే. లోపల సీకటి. తడిక్కన్నాళ్లోంచి సూత్తే అయివులే. అజాపజాలే. తడికె తలుపుతోత్తేతిడతాడని లింగరాజు ఇంటి ముంగిట బట్టలుతికే బండ మీద కూకున్నాడు.

లోపల్నించి కల్లోసన, కూరోసన కూసోలేక నిలుసోలేక సూద్దావని తలుపుదోత్తే

మసకెలుతురు పులురివినట్టు 'యెవుడ్రాడంటే నేనన్నా లింగణ్ణని బదులాడితే ఆడు దగ్గి యెవుడూ? అన్నాడా ఈడు నేనే అంటా తడికి తలుపు దోసి లోన దూరి యేం జేత్తనా అంటా పోయేడు. ఆడు మసకెల్తుర్లో తేరిపార జూసి వోరోరి నువ్వంటారా యెప్పుడొచ్చా, కూకో అన్నాడు. ఈడేకూసున్నాడు.

ఆడట్టా, ఈడిట్టా గోడకీవులు మోటిచ్చి కూకుండారు. ఆడికట్టు కల్లుముంత, తాంబేటి కాయ వుండాయి. ఆడు గోచీ బిగించి కూకుండాడు.

మూకుట్లో నంజుళ్ళు సుప్తాచేసేసేడాడు. కల్లు సివర గళాసులో కొచ్చేడు పేగుల్తింటన్నాడు.

పేగులెట్టా దింటన్నాడయ్యాంటే, ఆట్నిమల్లలో బెట్‌లా, మూకుట్లో మెయ్‌లా, అసలాటిని కొయ్‌లా. ఎట్టా దెచ్చేడో అట్టాగే వొండేడు. ఆ మొయ్యిన బార్లు బార్లుగా సుట్టేడు. ఆ సుట్టల్నిద జెందేలకమల్లె మెళ్ళో కేసుకున్నాడు. సేత్తో దీస్కునే పన్లే. ఒక్కొన నోట్లో బెట్టుకొన్నాడా, దాన్ని నవుల్తా వుంటే ఆ కొనట్టాగే నోట్లోకొత్తా ఉంది. సగానికి సగం దినేసేడు.

'యేందిరా బయపడ్డా' ఇబ్బందిగోడు మాట్టాడిత్తే మైకం కమ్మినోడికి మల్లె నోరెల్లబెట్టి అట్టాగే సూత్తంటే అణ్ణవ్వాడా? ఈడట్టాగే వొణికేడు.

'యేందిరా సిన్నా బయ్యివా? శా? యదవ నాయాల్ది. మనకేందిరా బయ్యిం?

లింగరాజు వొణుకుతా వుండీ, ఏందీ తిండి యిదేం దింటం అనేసేడు.

అనేసేడా, ఈడందుకొనే అందుకున్నాడు, గల గలా కళాపెళా నవ్వేడు. ఇరెణ్ణెకసిపోడి పేగులు నిట్టాడి పక్కోడు అట్టా యెగిరి గంతేసి ఇట్టా బట్టి పొట్ట సింపి, పేగుల్జందే వేసుకుని, ఇట్టాగే కొరిక నవిలింది అంటా పేగుల్ని చెక్కిలాలకి మల్లె కసాబిసా నమిలేత్తన్నాడు. కల్లు గళాసు ఖాళీ సేసేడు.

తింటం ముగిచ్చి, మూద్దుడుసుకుని, తాంబేటి కాయనీళ్ళు తాగి, తేంచి 'పిల్‌కాయలు బాగుండారా?' అంటావాని అడిగేడు.

'ఆ! బాగుండార్లే! అళ్ళకేం మాయరోగవా? అన్నరేగాని నువ్వాకాడికి నరిసింమూతివా?'

'ఆ మరేవనుకొంటన్నా? పేరు సెప్పలా? యేగిసేం యేం పేరు నరిసిమ్మూతి యేగిసెం యెయ్‌లా! నరసిమ్మూతి యెగిసేం ! ఇట్టాగే ఇరెణ్ణెక సిపోడి పేగుల్దింటం!

అబ్బో! నరసింమూతిగోడు సిన్నోడా, సితకోడా? అద్దెమద్దెపోడు, శానా పురాణం సెప్పేడు.

ఇంటంటే లింగరాజుకి శానా శానా దెల్సిపోయింది. కళ్ళనీళ్ళు కళ్ళ వాకిళ్ళం దంతన్నై. ఇంటూరుకోలేక ఇదన్నా అంటా అందుకున్నాడు లింగరాజు యేంది అంటా ఇబ్బంది గోడాడికి సెవి బారేసేడు.

"నరిసింమూతిగోడు ఉత్తరాదోడు. ఇరెణ్ణెకసిపు గోడు దచ్చాదోడు. ఈడు మనోడు. ఆడు పరాయోడు. ఆడొచ్చియాణ్ణి పావబొడిసి సెవులు మూసేడు. మనోడి కొడుకులేడా, అణ్ణి మాయజేసి బుట్టలో యేస్కుని మనోడి పేగుల్దెంచేడు.అది మాయది మోసమది మరబం".

"యేంది;" పులిగాండ్రిచ్చుద్దే, అట్టాకేకబెట్టేడు. పులిబోనులో దిరుగుద్దే అట్టా ఇంట్లో దిరగసాగేడు.లింగరాజుజ్ఞోగనన్నా, సదువన్నా, తెలివన్నా పొట్టపేగులోడి గ్గురి. లింగరాజాగలా.

'ఆడి జాతేరు. మంజాతేరు. పరాయి జాతోడొచ్చి మంజాతోణ్ణి జంపేడు. ఇరెణ్ణెకసివుణ్ణి సంపితే మనోణ్ణి సంపినట్టే. మనోణ్ణి మాయవేసి, ఆడొచ్చీణ్ణి సంపేడు.

'యేందిరా?' దిగాలుపడి కూకున్నాడు పొట్టపేగుల ఇబ్బంది గోడు.

'అమ్మనా కొడుకులు' అదిరిపడ్డాడు. ఈడు ఈసురుడి కొడుకు. మనోడి కొడుకు. మా యోడికీ మనోడికీ పగ, ఆడీదేసేపోడు గాడు. యాడోడో ఈడొచ్చి పడ్డాడు!

'యెట్టా? కూసున్నాడు జారిపోయి, నేల మీద వాలిపోయేడు.

పొరుగూరోడు మనూరోణ్ణి, మనోణ్ణి పొట్టసింపి, పేగుల్దెంచేడు. అది పేగుల్నువ్ దింటన్నావ్. మనోడి పేగులు మనోడే దింటం, మనోన్ని మనోడే చంపటం, యెట్టుంది యవ్వారం?

'శా శా శా! యెంత పనయిందిరా' కాండ్రించి ఊసేడు.

'ఇరెణ్ణెకసిపోడికి మన పోతురాజు లేడూ?'

'లేకేందిరా మీయన్నే గందా?'

'ఆడు గాదన్నా, మన దేవుడు. యాసపెట్టుకింద పోతురాసోవి.'

'ఆ మన కొలువుల సోని'

'ఆదే! కొడుకు! మన దేవుడయ్యని మనవే సంపుకొంటం యెట్టుంది యవ్వారం?'

' శా! యేం బాగా లేదరా సిన్నా'

'ఆడు మన పగోడు గాడు'

'మదెవుడు మన పగోడు.'

'మనోళ్ళందరి నోటికాడి కూడు తీసేత్తాడే ఆడు. ఆడు మన పగోడు.' అంతే

ఇబ్బందిగోడు నోరెత్తలా. పాడుకున్నోడు లేసేడు. లేసినోడు నిలబడ్డాడు. నిలబడ్డోడు ఇంటిలోపలికి వచ్చేడు. ఆడుకుక్కిన పేనుకు మల్లె సప్పబడిపోయేడు. లింగరాజు పోటం సూళ్ళా. తెల్లారటం సూళ్లా. అదోరం రాసూ వచ్చే పోనూ బోయా. ఆడు మాసం గోయ్‌లా, అమ్‌లా, పొట్టపేగుల్దిన్లా. అదో రాలొచ్చేయొచ్చె. పోయేయి బోయే, ఆ డిల్లు గదల్లా.

'నీకేవయిందిర్నియవ్వ?' అన్నా పలకలా. 'బువ్‌దిందువ్‌రారా' అంటే పోలా. సీకటి ఎలుతురూ ఆడికేం తెలియటల్లా.

ఆ రోజు ఆదోరం. అదేందోపొద్దుటే యాప సెట్టు మొదట్లో పోతురాజు కాళ్ళ కాడ నవ్వుతా కూకుండాడు. పొట్టపేగుల ఇబ్బందిగోడు.

తూరుపున చింతతోపు కవతల నల్లరేగడీ నేల్లో ఎర్రటి సూరీడు నుప్పుల్జిమ్ముతా వుండాడు. కరకర పొద్దెక్కింది. యెండ సురసురలాడిల్తా ఉంది.

పొట్ట పేగులోడి ఇంటి కూర వాసన పల్లెంతా గుప్పమన్నట్టు ఊరంతా గుబ్బట్లాడుతా ఉంది.

పల్లెల్లో కనపడని ఆనందం అళ్ల కాళ్ళ కింద నడిసి పోతా ఉంది.

కనపడ్డోళ్ళు కనపడ్డోళ్ళ సెవులు కొరుకుతా ఉండారు.

యెట్టోడు, మోతాదోడితో సెబుతుంతే పల్లోళ్ళంతా సెవులిరుసుకుని ఇంటన్నారు.

కరణంగోడు సచ్చేడు. ఆడింటోనే ఆడు సచ్చేడు. యెట్టా జచ్చేడో యెవుడికీ దెల్దు. పీక పిసకలా, గొంతు కొయ్యలా, కత్తితో పొడవలా, యేందిన్నాడో, యెంత కాలం నుంచి దింటన్నాడో, ఎవురెవురి నోటి కాడి కూడు దిన్నాడో తిని తిని తెగ బలిసిన పొట్ట ఇంక ఉబ్బలేక నిట్టనిలువుగా బగిలిపోయింది. పొట్టలో అలిసిన పేగులు ఆడి తిండి దెబ్బకు తట్టుకోలేక పరారయ్యేయి. ఆడి పొట్టలో ఒక్క పేగుంటే ఒట్టు. సుస్తాగా ఖాళీ!

★